క్లుప్తంగా

సరిగమపదని సుస్వరాల ఎంపిక పోటీలు రేపు

శ్రీకాకుళం కల్చరల్: ఉగాది సందర్భంగా మణి పాత్రుని క్రియేటివ్ అకాడమీ ఆధ్వర్యంలో సరిగమపదని సుస్వరాల ఎంపిక పోటీలు సత్యలాడ్జిలో బుధవారం జరుగుతాయని నిర్వాహకులు ఎం.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఎంపిక కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో గాయని, గాయకులకు, వివిధ రంగాల్లో పనిచేసిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సినీ దర్శకుడు ఎస్.ఎస్.పట్నాయక్, బాసంగి సురేష్, బలివాడ మల్లేశ్వరరావులు హాజరవుతారన్నారు.

కనకదుర్గ ఆలయ హుండీ ఆదాయం రూ.1.45 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని పాత బ్రిడ్జి రోడ్డులో ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవాలయం హుండీల ఆదాయం రూ. 1,45,501 వచ్చినట్లు ఈవో శ్యామలరావు సోమవారం తెలిపారు. 120 రోజులకు ఈ ఆదాయం సమకూరిందన్నారు. హుండీ లెక్కింపులో దేవదాయ శాఖ తరఫున ఈవో జి.గురునాథరావు, ఆలయ ధర్మకర్త, అర్చకులు ప్రసాద్ పాల్గొన్నారు.

కుమార్‌రాజుకు ఉగాది కవి సత్కారం


కుమార్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజుకు ఉగాది కవి సత్కారం జిల్లాకేంద్ర గ్రంథాలయంలో ఈవేమన కవితా నిలయం ఆధ్వర్యంలో శనివారం జరిగింది. కార్యక్రమంలో కవితా నిలయం అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్‌రఫీ, బి.ఉమామహేశ్వరరావు, సురంగి మోహనరావు, తపస్వి పత్రిక సంపాదకులు ఎస్.కార్తీక్, జంధ్యాల శరత్‌బాబు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


అదపాకలో పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

లావేరు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా అదపాక, గుమడాం, లావేరు, లింగాలవలస, వెంకటాపురం, బెజ్జిపురం, తాళ్లవలస సచివాలయాల పరిధిలో గ్రామాల్లో సోమవారం పశుసంవర్ధక శాఖ అధికారులు శిబిరాలు నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

లావేటిపేటలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేటిపేట గ్రామంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్త, కాలువల్లో పూడికలను తొలగించి డంపింగ్ యార్డ్‌కు ట్రాక్టర్‌తో తరలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న యశ్వంత్

జి.సిగడాం: వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి స్థానిక వైద్యాధికారి యశ్వంత్ సూచించారు. సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలన్నారు. సీహెచ్‌వో కుప్పిలి శివకుమార్, ముంజేటి ఉమ, సూపర్‌వైజర్ భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు రమాదేవి, సంధ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

● బీఆర్‌ఏయూ వీసీ వెంకటరావు


మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: సమాజ ప్రగతిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని బీఆర్‌ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్లో సోమవారం ప్రపంచ సోషల్ వర్కు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అనేక అంశాలపై వెనుకబాటు తనం ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం, అవగాహనతోనే ప్రగతి సాధ్యపడుతోందని చెప్పారు. మనప్రాంత ఉత్పత్తులను ప్రజల్లో తీసుకెళ్లేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని అన్నారు. ఈ విధంగా చేయటం వల్ల వృత్తులను నమ్ముకున్న వారికి ఉపాధితో పాటు, జిల్లాకు గుర్తింపు వస్తోందని చెప్పారు. మందస పాలకోవ, పలాస జీడి పప్పు, బెజ్జిపురం జూట్ ఉత్పత్తులు, ఉద్దానం కొబ్బరి, పొందూరు ఖాదీ, బుడితి ఇత్తడి వంటి ఉత్పత్తులపై విస్తృత ప్రచారం అవసరమన్నారు. అంటు, ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన, ప్రకృతి విపత్తుల నుంచి కోలుకోవటం వంటివి స్వచ్ఛంద సంస్థలతోనే సాధ్యమన్నారు. రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు, సమాజ ప్రగతి వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావటంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకలన్నారు. విశ్వవిద్యాలయంలో సోషల్ వర్కు విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.అనురాధ, డాక్టర్ యు.కావ్యజోత్స్న, సామాజిక అనుసంధాన కార్యక్రమాల సమన్వయకర్త డాక్టర్ కంచరాపు తారకరామారావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, కొమ్ము రమణమూర్తి, నూక సన్యాసిరావు, కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం


ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పెంట గ్రామ సచివాలయంలో పని చేసి బదిలీపై వెళ్లిన పశువైద్య ఉద్యోగి వారణాసి రమేష్, ఏఎన్‌ఎం యండమూరి నాగమణిలను స్థానికులు, తోటి సిబ్బంది సోమవారం సత్కరించి గౌరవించారు. గ్రామ సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, బత్తుల గోపి పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు చేసే మెరుగైన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు సాధ్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి పోట్నూరు సురేష్, రైతు చైతన్యకుమారి, ఏఎన్‌ఎం భవానీ, సచివాలయం అసిస్టెంట్లు సాకేటి ప్రసాద్, వావిలిపల్లి మనోజ్, తరిణి వాసు, సుభాషిని, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

అమ్మవారి స్థలాన్ని సర్వే చేయాలని వినతి


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాం గ్రామదేవత అమ్మవారి ఆలయానికి చెందిన స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులను కేటాయించాలని సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ, మాజీ సర్పంచు వెలిది సాయిరాం కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావుకు సోమవారం వనతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయన కమిటీ సభ్యులు కీర్తి సత్యం, సీర్ల సోంబాబు, లక్ష్మంనాయుడు తదితరులున్నారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న ఎస్‌బీఐ అధికారులు


డీజీఎం పంకజ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల బృందం సోమవారం దర్శించుకుంది. డీజీఎం పంకజ్ కుమార్, కె.జి.రావు, మంజు శర్మ, ఆశ శర్మ తదితరులకు ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వారికి వివరించారు. వేదాశీర్వచనాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ పీఆర్వో రామ్మూర్తినాయుడు, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తమ బ్యాంకు తరఫున సాయం అందిస్తామని అధికారుల బృందం ప్రకటించింది.

ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేయండి


మాట్లాడుతున్న శారద

జి.సిగడాం: వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఇతర సామగ్రి కోసం రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రణాళికలను తయారు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి యర్రా శారద ఆదేశించారు. స్థానిక ఆర్‌బీకేలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. రైతులు పండించిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఏఈఓలు కంబాల జగదీశ్వరావు, అప్పారావు పాల్గొన్నారు.

లేగదూడల సంరక్షణకు ప్రాధాన్యత

● పశు సంవర్థక శాఖ డీడీ జగన్నాథం


లేగ దూడల యజమానులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

రణస్థలం: లేగ దూడల సమయంలోనే సంరక్షణ సక్రమంగా ఉంటే దృఢమైన పాడి పశువులుగా అభివృద్ధి చెందుతాయని పశుసంవర్ధకశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం.జగన్నాథం అన్నారు. సంచాం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులన్నారు. పుట్టిన తరువాత రెండు గంటల్లోగా దూడకు జున్ను పాలు తాగించాలని సూచించారు. పశువైద్యుల సూచనల మేరకు నట్టల నివారణ మందులు వాడాలన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం 90 శాతం ఆడ దూడల ఉత్పత్తి జరిగే పథకం గురించి పాడి రైతులకు వివరించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 64 మంది పాడి రైతులు తమ లేగ దూడలను పదర్శనకు తీసుకువచ్చారని చెప్పారు. ఆరోగ్యంగా, దృఢంగా ఉన్న దూడలను గుర్తించి బహుమతులను అందజేశారు. మీసాల చక్రధర్, చందక రమణలకు చెందిన దూడకు మొదటి, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. ఏఈవోడీఎల్‌డీఏ డీడీ ఎస్.మన్మథరావు, రణస్థలం ఏడీఏ బంటుపల్లి దుర్గారావు, రణస్థలం మండల పశు వైద్యాధికారి ఎ.రాంకుమార్, పైడిభీమవరం పశు వైద్యాధికారి బి.చంద్రశేఖర్, సంచాం గ్రామ సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, ఎంపీటీసీ సభ్యురాలు సువ్వాడ రమణమ్మ, నాయకుడు రెడ్డి రామునాయుడు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఒంగోలు జిల్లాలో న్యాయవాది ఎ.వెంకట భగావాన్‌పై భవానీపురం పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు నుంచి కాంప్లెక్సు వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విధులను బహిష్కరించారు. విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులపై ప్రైవేటు వ్యక్తులు కేసు పెడితే పోలీసులు విచారణ లేకుండా కేసును నమోదు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు బెజ్జిపురం ఫాల్గుణరావు, కూన రాజారావు, సువ్వారి తవిటి నాయుడు, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆగూరి ఉమామహేశ్వరరావు, అరకితోట క్రిష్ణరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగికి సన్మానం


యోగానంద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విధినిర్వహణలో ఎంతో అంకిత భావం కలిగిన వ్యక్తి వి.యోగానంద్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సువ్వారి సత్యన్నారాయణ (ఢిల్లీ) అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన యోగానంద్ పదోన్నతిపై విశాఖకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో ఆయన్ని సత్కరించారు. యోగానంద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, ఉద్యోగులు చిరంజీవులు, ప్రత్యూష, భానుమతి, ఈశ్వరరావు, రామమోహన్ ఉన్నారు.

న్యాయం చేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న బాధితులు

శ్రీకాకుళం రూరల్: కొనుగోలు చేసుకున్న స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి న్యాయం చేయాలని గాయత్రి టౌన్‌షిప్ బాధితులు కోరారు. ఈ మేరకు నగరంలోని గొంటివీధి సమీపంలో ప్రకాశనగర్‌లో ఉన్న టౌన్‌షిప్ ప్రతినిధులు బరాటం కిరణ్‌కుమార్, అప్పన్నశెట్టి, కలివరపు వెంకటావులను కోరారు. వారి ఇళ్ల సమీపంలో సోమవారం ధర్నా చేశారు.

పిచ్చుకలను కాపాడి ప్రకృతిని రక్షించాలి


ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

లావేరు: పిచ్చుకలను కాపాడి ప్రకృతిని రక్షించాలని బుడుమూరు హైస్కూల్ హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఎస్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. హైస్కూల్‌లో సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. పిచ్చుకల ప్రాధాన్యతను తెలియజేస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేశారు. అలాగే పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పిచ్చుకలు అంతరించుకుపోతే ప్రకృతికి విఘాతం కలుగుతోందని.. వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.అనూరాధ, కేఎస్ బేగమ్, కేఎస్ ప్రసాద్, కె.వెంకటరావు, కె చినపెంటయ్య, సీఆర్‌పీ ఎం.రమేష్ ఉన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలోని విశాఖ పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. శ్రీసాయి దంత వైద్య కళాశాల వైద్యులు డాక్టర్ నందిత, డాక్టర్ ఇ.ఒలివా మార్గరేట్, డి.మేఘన, కె.అనూష తదితరులు దంత పరీక్షలు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. దంతాల పరిక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించిన బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్, హెచ్‌ఎం పి.రామారావు పాల్గొన్నారు.

నీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

శ్రీకాకుళం రూరల్: వేసవిలో ఎక్కడైనా నీటి సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు వీలుగా శ్రీకాకుళం మండలాభివృద్ధి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్షిత పథకాలు పని చేయకపోయినా, పైపులైన్ల లీకులు ఉన్నా, బావులు అడుగంటినా సమాచారాన్ని ప్రత్యేక సెల్ నంబర్ 94406 42096కు తెలియజేయాలని సూచించారు.

పన్ను చెల్లింపుదారులకు వడ్డీ మాఫీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 31వ తేదీలోగా ఇళ్లు, ఖాళీ స్థలాల పన్ను చెల్లించేవారికి వడ్డీ మాఫీ చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించినట్లు శ్రీకాకుళం మున్సిపల్ నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుంచి సోమవారం పత్రికా ప్రకటన విడుదలైంది. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో కూడా పన్నులను చెల్లించుకోవచ్చునని సూచించారు.

అంగన్‌వాడీల ధర్నా


కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్– హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సోమవారం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాలన్నారు. పనిభారం పెంచే యోచన మానుకోవాలని కోరారు. కార్మికులందరూ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

శేషగిరికి డాక్టరేట్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ కాంట్రాక్టు అధ్యాపకుడు హనుమంతు శేషగిరికి అనంతపురం జేఎన్‌టీయూ సోమవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ వీబీ చిత్ర, ప్రొఫెసర్ ఎం.రవిచంద్రలు పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యం ఏ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్స్ ఇన్ అలిస్ వాకర్స్ సెలెక్టెడ్ నొవెల్స్ అనే అంశంపై డాక్టరేట్ చేశారు. ఈయన స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం బెండి.

● సీఎం జగన్‌ను కలిసిన కృష్ణమూర్తి



శ్రీకాకుళం డీసీఎంఎస్ వైస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అమరావతిలోని అసెంబ్లీ లాబీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణదాస్ ఆయన్ని సీఎంకు పరిచయం చేశారు.
-శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు


దంపతులకు గిఫ్ట్‌బాక్స్ అందజేస్తున్న వైద్యులు

శ్రీకాకుళం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. సీతంపేటకు చెందిన కల్యాణి, బిడ్డిక లక్ష్మీనారాయణ దంపతులకు సంతానం కలగకపోవడంతో శ్రీకాకుళంలోని వైజాగ్ ఐవీఎఫ్ కేంద్రాన్ని సంప్రదించారు. డాక్టర్ మృదుల వీరికి చికిత్సనందించగా సోమవారం ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడ పిల్లకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: టెక్కలి ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 17న జరిగిన తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఒడియా భాషల జాతీయ జాతీయ సదస్సులో మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థలకు చెందిన గాయత్రి కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను కళాశాల అధినేత జీవీ స్వామి నాయుడు సోమవారం అభినందించారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఇద్దరు ఎంపిక


ఎం.భాగ్యలక్ష్మి


డి.యశోద

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడాపోటీలకు జిల్లా నుంచి ఇద్దరు మహిళా ఉద్యోగులు ఎంపికయ్యారు. కేరళలో ఈనెల 21 నుంచి మొదలుకానున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి ఎం.భాగ్యలక్ష్మి (ఖజానాశాఖ అధికారి), డి.యశోద (విద్యాశాఖ పీడీ) వెళ్లనున్నారు. వీరిద్దరు సోమవారం ఇక్కడ నుంచి బయల్దేరారు. వీరిని ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా జగదీష్, తదితరులు అభినందించారు.

శివకామేశ్వరస్వామికి మాసశివరాత్రి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంచేసిన శ్రీలలితా సహిత శివకామేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే గుజరాతిపేటలోని శ్రీరాజరాజేశ్వరీ లలితాదేవి పీఠంలో కూడా స్వామివారికి అభిషేకాలు జరిగాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పఖ్వాడా వేడుకలు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చేనెల మూడో తేదీ వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ పఖ్వాడా వేడుకలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ ఎస్ఎంపురం సీడీపీవో పాపినాయుడు తెలిపారు. ఎచ్చెర్లలో ఆయన సోమవారం మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు పిల్లలు, కౌమార దశ బాలికలు, గర్భిణులు, బాలింతల్లో ఆహార ప్రాధాన్యతపై విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు పౌష్టికాహార కేంద్రాలుగా పనిచేస్తున్నాయని అన్నారు.